సాక్షి అనకాపల్లి

శనివారం । 22 । మార్చి । 2025



సింహవల్లీ తాయారు తిరువీధి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారుకు శుక్రవారం తిరువీధి ఘనంగా నిర్వహించారు.



ధ్యానంతో ప్రశాంత జీవనం

భీమిలి: ఇంద్రద్యుమ్న మందిరంలో ధ్యానోత్సవ శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ నిర్వహిస్తున్నాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	శని	ఆది
అనకాపల్లి	6.13	4.44
నర్సీపట్నం	6.15	4.42

కరుణ కురిసింది..

మూగజీవులకు నీరు దొరికింది



పశువులకు తొట్టెలలో నీటిని అందిస్తున్న చిన్నారులు



పక్షుల దాహార్తిని తీర్చేందుకు పాత్రలలో అందుబాటులో ఉంచిన నీరు

ఈ కాంక్రీట్ జంగిల్‌లో పక్కనున్న మనుషుల గురించే పట్టించుకోరు.. మరి పశుపక్ష్యాదుల గురించి ఆలోచించేదెవరు? వేసవిలో మూగజీవుల దాహార్తి ఎలా తీరుతుంది.. వాటికి నీటిని అందుబాటులో ఉంచితే ఎంతో బాగుంటుంది కదా.. ఈ ఆలోచనలను బాలల్లో రేకెత్తించేలా ఈనెల 22న ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని కె.కోటపాడులోని ఒక ప్రైవేట్ పాఠశాల వినూత్న కార్యక్రమం నిర్వహించింది. తమ విద్యార్థులతో శుక్రవారం పాఠశాల ఆవరణలో పక్షులకు ప్రత్యేకమైన పాత్రలలో నీటిని ఏర్పాటు చేయించారు. పశువులు, శునకాల దాహార్తిని తీర్చేందుకు తొట్టెలలో నీటిని అందుబాటులో ఉంచారు. చేపలకు నీటి వనరుల ప్రధాన అవసరాన్ని వివరించేందుకు.. నీటితో నింపిన ట్రేలలో చేపలను వేసి అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ విద్యార్థులకు చూపించారు. మనకు ఎంతో మేలు చేసే మొక్కలు బతకడానికి నీరు ఎంత అవసరమో ఆచరణాత్మకంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వరల్డ్ వాటర్ డేను పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి ప్రకటించిన గ్లేసియర్ ప్రిజర్వేషన్ థీమ్‌కు తగ్గట్టుగా విద్యార్థి గీసిన చిత్రం తోటి విద్యార్థులను ఆకట్టుకుంది. - కె.కోటపాడు



నీటి ప్రాముఖ్యతను వివరించేలా విద్యార్థి గీసిన చిత్రం

మట్టిలో మాణిక్యం

- గేట్‌లో మెరిసిన మర్రివలస విద్యార్థి
- తల్లిదండ్రులు రైతు కూలీలు

రావికమతం:

తల్లిదండ్రులు అమ్మిరెడ్డి కోటేశ్వరరావు, లక్ష్మి సామాన్య రైతు కూలీలు.. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు.. ఉన్నతాశయంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు.. ఇప్పుడు గేట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 12వ ర్యాంక్‌తో టాప్ లేపాడు.. ఇదీ మర్రివలస గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి అశోక్ విజయ ప్రస్థానం. సామాన్య కుటుంబం నుంచి వచ్చినా మట్టిలో మాణిక్యంలా రాణించాడు. కొత్తకోట హైస్కూల్లో చదివి 10/10 సాధించడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్ వచ్చింది. ఇప్పుడు జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్‌లో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో 863 మార్కులతో 12వ ర్యాంక్ సాధించాడు. పేద కుటుంబంలో పుట్టి జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించిన అశోక్‌ను గ్రామ సర్పంచ్ పాత్రుడు, ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు, గ్రామ పెద్దలు, యువకులు, ఉపాధ్యాయులు అభినందించారు.



తల్లిదండ్రులు కోటేశ్వరరావు, లక్ష్మితో అశోక్

సాధారణ భక్తులకు గంటలోపు దర్శనం

8లో

న్యూస్‌రీల్

ముషిడిపల్లిలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు



ముషిడిపల్లిలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు

దేవరాపల్లి: ముషిడిపల్లి గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం పర్యటించింది. నలుగురు సభ్యులతో కూడిన జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ముందుగా ఆయుష్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)ను సందర్శించింది. డీపీఎంవో డా.ప్రశాంతి, డీపీవో జగదీష్, ఎస్‌వో రామచంద్ర, డేటా మేనేజర్ జనార్దన్ తదితర జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు అక్కడ పలు రికార్డులను తనిఖీ చేశారు. స్థానికంగా అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రజలకు, విద్యార్థులకు అందించిన వైద్య సేవలను, యాప్‌లో నమోదు చేసిన వివరాలను సరిపోల్చి చూశారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి రోగుల ఇంటికి వెళ్లి కలిసి వైద్య సేవలు అందాయా లేదా అని ఆరా తీశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘన తదితర ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

రెండు భారీ వాహనాలకు రూ.92 వేల జరిమానా

మునగపాక: అనుమతులు లేకుండా అధిక లోడుతో వెళుతున్న రెండు లారీలకు గురువారం రాత్రి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పూడిమడక రోడ్డులో అధిక లోడుతో బండరాళ్లను తరలిస్తున్న లారీలను పట్టుకున్నామని, ఈ రెండు లారీలకు రూ.92 వేల జరిమానా విధించామన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా భారీ వాహనాలు నడపితే కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.

జాతీయ వుషూ టోర్నమెంట్‌కు వేపాడ ప్రియాంక



నర్సీపట్నం: ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్‌లో జరిగే జాతీయ వుషూ పోటీల్లో నర్సీపట్నం క్రీడాకారిణి వేపాడ ప్రియాంక పాల్గొంటున్నట్టు కోచ్ శేఖర్ తెలిపారు. సీనియర్ ఉమెన్ కేటగిరి 70 కిలోల విభాగంలో ఆమె పోటీ పడతారని చెప్పారు. నింజాస్ అకాడమీ డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, శ్రీకాంత్, ఎస్ఆర్ఐ అల్లాడి సురేష్, శాప్ కోచ్ అబ్బు ఆమెను అభినందించారు.

సరకు రవాణాలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే సరికొత్త రికార్డు

తాటిచెట్లపాలెం: సరకు రవాణాలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే సరికొత్త రికార్డును నెలకొల్పినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలోనే 2024-25సంవత్సరంలో 250మిలియన్ టన్నుల సరకును లోడింగ్ చేసి దేశంలోనే తొలి జోన్‌గా రికార్డు సృష్టించింది. దీంతో గతంలో ఉన్న అన్ని రికార్డు కనుమరుగైపోయినట్లు తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే వరుసగా రెండో ఏడాది కూడా 250 మిలియన్ టన్నుల మార్కును చేరుకుంది. ఇందులో వాల్తేర్, సంబల్‌పూర్, ఖుర్దారోడ్ మూడు డివిజన్‌ల పాత్ర ఎంతో ఉంది. ముఖ్యంగా ఈ పరిధిలో గల బొగ్గు గనులు, పారాదీప్, ధమర, విశాఖపట్నం, గంగవరం, గోపాల్‌పూర్ పోర్టులు, బైలదిల్లాలో గల ఐరన్ ఓర్ గనులు, స్టీల్, అల్యూమినియం పరిశ్రమల వ్యాపారుల సహకారంతో ఈ రికార్డు సాధించగలిగింది.

- గోవాడ ఫ్యాక్టరీ గేటు ముందు బీఎన్ రోడ్డుపై రాస్తారోకో
- కూటమి ప్రభుత్వం తమను విస్మరించిందని ఆగ్రహం
- బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత



ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

కదం తొక్కిన చెరకు రైతులు



ఫ్యాక్టరీ బయట రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న చెరకు రైతులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద చెరకు రైతులు కదం తొక్కారు. కూటమి ప్రభుత్వం ఫ్యాక్టరీని, చెరకు రైతులను పూర్తిగా విస్మరించిందంటూ శుక్రవారం ఆందోళన చేశారు. ఒక దశలో ఈ ఆందోళన తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. యాజమాన్యంపై రైతులు తిరుగుబాటుకు దిగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని సముదాయించారు. బీఎన్ రోడ్డుపై చోడవరం-అనకాపల్లి రోడ్డులో ఫ్యాక్టరీ గేటు వద్ద రైతులు రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అనకాపల్లి, విశాఖపట్నం, చోడవరం, పాడేరు, మాడుగుల ప్రాంతాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో రోడ్డుకు ఇరుపక్కలా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఏపీ చెరకు రైతు సంఘం, ఏపీ రైతుసంఘం, ఏపీ రైతు కూలీసంఘం, ఏపీ వ్యవసాయ రైతు కూలీసంఘం, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ మహాధర్నాను నిర్వహించారు. సీఐ అప్పలరాజు తన సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుగా గేటు వద్ద టెంటు వేసి ధర్నా చేశారు. అనంతరం బీఎన్‌రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. ప్రభుత్వం వెంటనే చెరకు బకాయిలు చెల్లించాలని, ఫ్యాక్టరీకి రూ.9 కోట్లు తక్షణ సాయంగా అందించాలని, ఆధునికీకరణకు రూ.35 కోట్లు మంజూరు చేయాలని, ఈ ఏడాది చెరకు బకాయిలు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం చెరకు రైతులను మోసం చేసిందని, ఫ్యాక్టరీని ఆదుకోవడంతో



ఫ్యాక్టరీ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

పాటు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి 9 నెలలు దాటినా, క్రషింగ్ సీజన్ ముగుస్తున్నా నేటికి ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదని రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతన్నారు.. ఇంతన్నారు..

స్థానిక ఎంపీ సీఎం రమేష్ కేంద్రంలో ఎంతో పలుకుబడి ఉందని గొప్పలు చెప్పడం కాదని, ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని చెరకు రైతులు డిమాండ్ చేశారు. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీ ఇబ్బందులను, చెరకు రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కనీస సాయం కూడా తేలేకపోయారని, దీనివల్ల ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి పాత మిషనరీతో తరుచూ ఆగిపోతూ రైతులకు ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. ఫ్యాక్టరీ ఎండీని కలిసేందుకు రైతులంతా ఒక్కసారిగా ఫ్యాక్టరీలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు గేట్లు వేసి వారిని ఆపడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో పోలీసులు, రైతు సంఘాల నాయకుల మధ్య కొంతసేపు వాగ్వివాదం జరిగింది. పరిస్థితి అదుపు తప్పేలా ఉండటంతో రైతులను ఫ్యాక్టరీ పరిపాలన భవనం వరకు అనుమతించారు. అక్కడకు ఎండీ సన్యాసినాయుడు వచ్చి రైతులతో మాట్లాడారు. ఆయనకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈనెలాఖరులోగా ఈ ఏడాది చెరకు సరఫరా చేసిన రైతులకు టన్నుకు రూ. 3 వేల చొప్పున మొదటి పేమెంట్స్ ఇస్తామని, ఫ్యాక్టరీ ఆధునికీకరణ విషయం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని, పాతబకాయిలు కూడా త్వరలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఎండీ చెప్పారు. దీనితో రైతులు శాంతించి మహాధర్నాను విరమించారు. ఈ ఆందోళనలో ఏపీ చెరకు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, సీఐటీయూ నాయకులు గూనూరు వరలక్ష్మి, ఎస్వీనాయుడు, సీపీఐ నాయకుడు రెడ్డిపల్లి అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం, వ్యవసాయ కూలీ సంఘాల నాయకులు డి.వెంకన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

తుమ్మపాల: కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలలో (కేజీబీవీ) 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్టు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి ఆర్.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గల 20 (టైప్-3) కేజీబీవీలలో 6, 11 తరగతులలో ప్రవేశాలతోపాటు 7, 8, 9 తరగతులలో ఖాళీలను కూడా భర్తీ చేయడానికి ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారని తెలిపారు. జిల్లాలోని 20 విద్యాలయాల్లో 1600 సీట్లకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. అనాథలు, బడి బయట ఉన్న బాలికలు, డ్రాపౌట్స్, దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, వలస కార్మికులు, తల్లిదండ్రులలో ఒకరే ఉన్నవారు అర్హులని, అటువంటి వారు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.1.40 లక్షలు ఉన్నవారు మాత్రమే అర్హులని తెలియజేశారు. అర్హులైన బాలికలు కేజీబీవీలలో దరఖాస్తులు చేసుకునేందుకు బాలికతోపాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటోతోపాటు ఫోన్ నెంబరు ఉండాలని చెప్పారు. దగ్గరలో ఉన్న కేజీబీవీకి వెళ్లి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. మరింత సమాచారం కోసం సమగ్ర శిక్ష అనకాపల్లి కార్యాలయంలో ఫోన్ నెం. 7729882022ను సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.

24, 27 తేదీల్లో ఆరోగ్యమిత్రల నిరసనలు

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో 17 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న జిల్లాలోనూ, 27న మంగళగిరి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది, జిల్లా మేనేజర్, టీం లీడర్స్, ఆఫీస్ అసోసియేట్స్, ఆరోగ్యమిత్ర సీసీ డీఈవో సిబ్బంది 17 సంవత్సరాల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, చనిపోయిన వైద్య సేవ ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ కల్పించాలని, తదితర డిమాండ్లతో ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్టీఐ చట్టం అమలుకు అత్యంత ప్రాధాన్యం

- తీసుకున్న చర్యలను దరఖాస్తుదారుడికి వివరించాలి
- లేకుంటే అధికారులపై కఠిన చర్యలు
- వర్చువల్ విధానంలో అప్పీల్‌ను విచారించిన రాష్ట్ర సమాచార కమిషనర్



వర్చువల్ విధానంలో విచారణ జరుపుతున్న రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్

అనకాపల్లి టౌన్:

దేవదాయ ధర్మాదాయ శాఖ పరిపాలన విభాగాలలో ఆర్టీఐ చట్టం అమలుకు తీసుకున్న చర్యల వివరాలను దరఖాస్తుదారునికి తక్షణం అందజేయాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆ శాఖ అధికారులను హెచ్చరించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని కమిషనర్, ఆర్‌జేసీ, డీసీ, ఏసీ, జిల్లా అధికారి, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ మొదలైన పరిపాలన కార్యాలయాలలో ఆర్టీఐ చట్టం అమలు విషయంపై రాష్ట్ర సమాచార కమిషన్‌లో దాఖలైన అప్పీలును వర్చువల్ విధానంలో ఆయన శుక్రవారం విచారించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారు కోరిన సమాచారం ఇవ్వకుండా దాటవేత ధోరణితో.. హైకోర్టు తీర్పు ప్రకారం దేవదాయ, ధర్మాదాయ శాఖకు ఆర్టీఐ చట్టం వర్తించదని అధికారులు పొంతన లేని సమాధానాలివ్వడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ దేవదాయ ధర్మాదాయ శాఖ పరిపాలక కార్యాలయాల వద్ద అధికారుల హోదా, ఫోన్ నెంబర్, ఆఫీస్ చిరునామాలతో ప్రజలకు కనిపించేలా ఉండాల్సిన బోర్డులు పూర్తి స్థాయిలో లేవని, ఇందుకు సంబంధించిన వివరాల కోసం దరఖాస్తు చేయగా అధికార వర్గాలు పూర్తి స్థాయిలో స్పందించకపోవడంతో ఆయన రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు.

ఈ నేపథ్యంలో వర్చువల్ విధానంలో అప్పీలు విచారణ జరిగింది. అనంతరం దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని తక్షణం అందజేయాలని కమిషనర్ ఆదేశించారు.

రక్షణ చట్టం కోసం లాయర్ల నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్: న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఆమోదించాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్, ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పి.ఎస్.అజయ్ కుమార్ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్ న్యాయస్థానాల సముదాయం వద్ద తమ డిమాండ్లు ఆమోదించాలని శుక్రవారం పలువురు లాయర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల చట్టాన్ని దేశంలో అన్ని రాష్ట్రాల్లో తీసుకురావాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. 2022 జూలై నెలలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవాదుల రక్షణ బిల్లు ముసాయిదాను తయారుచేసి రాష్ట్రాల్లోని అన్ని ప్రభుత్వాలకు పంపించిందన్నారు. ఈ ముసాయిదా బిల్లు ఆధారం చేసుకొని రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే చట్టాలు రూపొందించాయని, ఏపీ శాసనసభలో కూడా వెంటనే చట్టంగా మార్చాలని అన్నారు. సీనియర్ న్యాయవాది ఐఆర్ గంగాధర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి లక్షణ్‌రావులు మాట్లాడుతూ దళిత బహుజన సామాజిక వర్గాలు, ఆదివాసీలు, మహిళల నుంచి న్యాయవాద వృత్తిలోకి వస్తున్న వారు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నారని ఈ రక్షణ చట్టం వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు.

వ్యవసాయ, విద్యా రుణాలకు ప్రాధాన్యం

- డెయిరీ, పౌల్ట్రీ ఉపాధి రంగాలకు ఊతం
- మాంస, కూరగాయల క్లస్టరుగా జిల్లా
- రుణ ప్రణాళిక విడుదల చేసిన కలెక్టర్



పొటెన్షియల్ లింక్డ్ కార్యాచరణ 2025-26 ప్రణాళిక పుస్తకాన్ని విడుదల చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఇతర అధికారులు

తుమ్మపాల: జిల్లాను మాంస, కూరగాయల క్లస్టరుగా ప్రకటించినందున బ్యాంకులు వ్యవసాయ, డెయిరీ, పౌల్ట్రీ ఉపాధి రంగాలకు లక్ష్యాలకు మించి రుణాలు అందించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) త్రైమాసిక సమావేశం జరిగింది. 2025-26 పొటెన్షియల్ లింక్డ్ కార్యాచరణ ప్రణాళిక పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే సంవత్సరానికి 17 శాతం వృద్ధి రావాలని, అందుకు అనుగుణంగా యూనిట్లు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో పశువులు, గొర్రెలు, నాటుకోళ్ల పెంపకం, మైదాన ప్రాంతంలో కూరగాయలు పెంపకం జరిగే విధంగా ప్రణాళిక వేసి, యూనిట్లు స్థాపించాలన్నారు. మాంస ఉత్పత్తుల యూనిట్లు, కూరగాయలు ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ కేంద్రాలకు విరివిగా రుణాలు అందించాలన్నారు. పంటకోత అనంతరం నష్టాలు తగ్గించాలని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి విద్యారుణాలు అందించాలని, రుణ మేళాలు, కళాశాలలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. తోటలు, కూరగాయలు, పశు సంవర్ధక, డెయిరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూతనివ్వాలన్నారు. ఆయా శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో వ్యవసాయ, అనుబంధ రంగ రైతులను ప్రోత్సహించాలన్నారు. కౌలు రైతులకు కూడా వ్యవసాయ రుణాలు అందించాలని, ఈ క్రాప్ ఆధారంగా వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు అందించాలని తెలిపారు.

జిల్లాలో ఉత్పత్తి అవుతున్న వస్తువులకు బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ గత సమావేశంలో చర్చించిన విషయాలపై తీసుకున్న చర్యలను, రుణ ప్రణాళిక అమలు నివేదికను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ పి.నరేష్, ఆర్‌బీఐ ఎంజీఆర్ఎల్‌డీ ఒ.రాజేష్ కుమార్ కుంద్, నాబార్డ్ డీడీఎం సమంత్ కుమార్, డైరెక్టర్ ఎస్‌బీఐ బి.విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డా.బి.రామమోహనరావు, ఉద్యానవన శాఖ అధికారి జి.ప్రభాకర్‌రావు, ఇతర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పి-4 సర్వేకు సంబంధించి జిల్లా అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జిల్లాలో సర్వే 99.86 శాతం పూర్తయిందని తెలిపారు.

క్లుప్తంగా

'పది' పరీక్షలకు 132 మంది గైర్హాజరు

అనకాపల్లి టౌన్: జిల్లాలో 107 కేంద్రాల్లో శుక్రవారం జరిగిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు రెగ్యులర్ 20,774 మంది విద్యార్థులకు 20,677 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటుగా రాస్తున్న 40 మంది విద్యార్థులకు ఐదుగురు హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం 20,814 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 20,682 మంది హాజరయ్యారని, 132 మంది వివిధ కారణాలతో గైర్హాజరైనట్టు తెలిపారు. అలాగే ఏపీ సార్వత్రిక విద్యా పీఠం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షకు 539 మంది విద్యార్థులకు 448 మంది హాజరయ్యారన్నారు. ఈ పరీక్షా కేంద్రాలను రాష్ట్ర స్థాయి పరిశీలకుడు, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అదనపు సంచాలకుడు పి.శ్రీనివాస్ తనిఖీ చేశారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

నర్సీపట్నం: చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేశామని రూరల్ ఎస్ఐ రాజారావు తెలిపారు. నర్సీపట్నం మండలం మెట్టపాలెం పంచాయతీ శివారు కసిరెడ్డిపాలెంకు చెందిన బర్ల సంతోషి బంగారం గొలుసు పోయిందని జనవరి 27న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు. నర్సీపట్నం అయ్యన్న కాలనీకి చెందిన ఎం.నాగరాజు గొలుసు చోరీకి పాల్పడ్డాడు. తన స్నేహితుడు ఈశ్వరరావు చేత గొలుసు బ్యాంక్‌లో తాకట్టు పెట్టించాడని ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో ఇద్దర్నీ అరెస్టు చేశామన్నారు.

సూపర్ జెయింట్స్ వచ్చేశారు



విశాఖ స్పోర్ట్స్: ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో తమ తొలి మ్యాచ్ ఆడేందుకు లక్నో సూపర్ జెయింట్స్(ఎల్ఎస్‌జీ) జట్టు విశాఖపట్నం చేరుకుంది. శుక్రవారం ప్రత్యేక విమానంలో లక్నో నుంచి జట్టు విశాఖకు వచ్చింది. వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈ నెల 24వ తేదీ రాత్రి 7.30 గంటలకు ఎల్ఎస్‌జీ, ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. గత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన రిషబ్ పంత్ విశాఖ స్టేడియంలో రెండు మ్యాచ్‌లు ఆడాడు. ఈసారి ఎల్ఎస్‌జీ జట్టుకు రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. తమ తొలి మ్యాచ్‌లో విజయం సాధించాలని ఇరు జట్లు ఉవ్విళ్లూరుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ప్రాక్టీస్ ప్రారంభించగా, ఎల్ఎస్‌జీ జట్టు శనివారం రాత్రి ప్రాక్టీస్ చేయనుంది. ఎల్ఎస్‌జీ జట్టుకు మెంటర్‌గా జహీర్ ఖాన్, హెడ్‌కోచ్‌గా లాంగర్, సహాయ కోచ్‌లుగా జాంటీ రోడ్స్, ప్రవీణ్ తంబే, లాన్స్ క్లుసెనర్ వంటి వారు ఉన్నారు. జట్టులో వికెట్ కీపర్లుగా ఆర్యన్, నికోలస్ అందుబాటులో ఉన్నారు. ఆల్‌రౌండర్లుగా మార్క్రమ్, మార్ష్, షాబాజ్ ఉండగా, బ్యాటింగ్‌లో ఆయుష్, డేవిడ్ మిల్లర్, సమద్ తమ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. బౌలింగ్‌లో రవి బిష్ణోయ్, ఆవేష్, ఆకాష్‌తో పాటు ఇంపాక్ట్ ప్లేయర్‌గా సిద్ధార్థ్ లేదా అర్షిన్ ఆడే అవకాశం ఉంది. అయితే మయాంక్, మోషిన్, ఆవేష్ గాయాల కారణంగా జట్టుకు అందుబాటులో ఉండటంపై సందేహాలు ఉన్నాయి. ప్రాక్టీస్ సెషన్ తర్వాత బౌలింగ్ విభాగంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇరు జట్లు గ్రూప్-2లో ఉన్నాయి. గత సీజన్‌లో ఇరు జట్లు కూడా లీగ్ దశలోనే నిష్క్రమించాయి. రాహుల్ రానట్టేనా? కాగా.. ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ఆటగాడు కె.ఎల్.రాహుల్ ఇంకా విశాఖ చేరుకోలేదు. దీంతో ఆయన విశాఖలో జరిగే రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం అనుమానమే.. దీంతో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగే తొలి మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున ఫెరీరా వికెట్ కీపర్‌గా బరిలోకి దిగే అవకాశం ఉంది. గత సీజన్‌లో రాహుల్ లక్నో జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు.







సాధారణ భక్తులకు గంటలోపు దర్శనం

- నూకాంబిక అమ్మవారి జాతర రాష్ట్ర పండగ
- పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశం

తుమ్మపాల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి జాతరను ఈ ఏడాది రాష్ట్ర పండుగగా ప్రకటించినందున, అందుకు తగినట్లుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 27 వరకు జరగనున్న అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో దేవదాయ శాఖ, పోలీసు, జీవీఎంసీ, ఎలక్ట్రికల్, ఎక్సైజ్, ఆర్టీసీ, తదితర శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండగ నిర్వహణలో ప్రొటోకాల్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇచ్చి, గంటలోపు దర్శనం కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి శాఖ అధికారులు ముందుగానే ప్రణాళికతో పండగ నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. గత సంవత్సరాల అనుభవాలతో సాధారణ రోజులు, ఆదివారం రోజుల్లో ఎంత మంది భక్తులు వస్తారో అంచనా వేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. భక్తులకు ఎండ తగులకుండా పందిర్లు, మంచినీరు అందుబాటులో ఉంచాలని చెప్పారు. శానిటేషన్ సక్రమంగా చేపట్టాలని, అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ పండగ జరిగినన్ని రోజులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్నారులకు పాలిచ్చేందుకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా, సురక్షితమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అమ్మవారి ఆలయ సమీపంలో మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, డీఎస్పీ ఎం.శ్రావణి, పండగ నిర్వహణ ప్రత్యేకాధికారి కె.శోభారాణి, ఆలయ నిర్వహణాధికారి బి.రాంబాబు, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. పి.రవికుమార్, జిల్లా అగ్నిమాపక, విపత్తుల నివారణ అధికారి ఆర్.వి.రమణ, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.శేఖర్, జిల్లా సహాయ ఇంజినీరు ఎ.వి.వి.శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

నేడు విద్యుత్తు వినియోగదారుల సదస్సు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గౌరీ గ్రంథాలయంలో విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక-ప్రజా ప్రయోజనాలు అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించనున్నట్టు ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా సీసీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ బిల్లింగ్‌లో లోపాలు, మరమ్మతులు, మీటర్లు కాలిపోవడం, అదనపు లోడు మంజూరు వంటి అంశాలపై ఆయన వినియోగదారులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



తేగాడ కేజీబీవీలో పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్న అనకాపల్లి జిల్లా 12వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి

కశింకోట: పోక్సో చట్టంపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి జిల్లా 12వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.వి.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని తేగాడలోని కేజీబీవీలో హైకోర్టు ఆదేశాల మేరకు పోక్సో చట్టంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలపై లైంగిక దాడికి పాల్పడే వారికి నేర తీవ్రత అనుసరించి 7 ఏళ్ల నుంచి జీవితాంతం వరకు కారాగార శిక్ష, ఒక్కోసారి ఉరి శిక్ష కూడా విధిస్తారన్నారు. బాలికలు, మహిళల భద్రత కోసం పలు చట్టాలున్నాయని, వాటి పై అవగాహన కలిగి ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన అవసరమన్నారు. అందొచ్చిన అవకాశాలు, ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకళ, న్యాయవాదులు కె.కుసుమ, కె.వి.రోజా, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వచ్చి సెల్‌ఫోన్ చోరీ

నర్సీపట్నం: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు లాక్కుపోయారు. కోటవురట్ల మండలం యండపల్లి గ్రామానికి చెందిన కె.అచ్చంనాయుడు శుక్రవారం పని నిమిత్తం బైక్‌పై నర్సీపట్నం వెళ్తున్నాడు. నర్సీపట్నం మండలం ధర్మసాగరం సమీపం వద్ద ఇద్దరు గుర్తు తెలియని యువకులు పల్సర్ బైక్ వచ్చి సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. బాధితుడు లబోదిబోమంటూ నర్సీపట్నం రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. ధర్మసాగరం వద్ద తరచూ ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి. గతంలో ఒక వ్యక్తిని బెదిరించి నగదు పట్టుకుపోయారు. మధ్యాహ్న సమయం, రాత్రి 10 గంటల తరువాత ఒంటరిగా వెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. పోలీసులు నిఘా పెంచి నిందితులను అరెస్ట్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి



పాయకరావుపేట: రైలు ఢీకొని గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తుని రైల్వే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని రాజీవ్ కాలనీ ఎదురుగా ఉన్న రైల్వే గేట్ సమీపాన ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా ఈనెల 17న రైలు బలంగా ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. 108లో తుని ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు పసగడుగుల సత్యనారాయణ(55) పి.కొత్తపల్లి గ్రామంగా తెలిసిందన్నారు. డి.పోలవరం గ్రామం వెళ్లేందుకు పట్టాలు దాటుతున్నట్లు తెలిపారు. మృతుడు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కుంచంగి క్వారీలో కార్మికుడి మృతి

అనకాపలి టౌన్: మండలంలోని కుంచంగి క్వారీలో ఒడిశాకు చెందిన కె.జానీ అనే కార్మికుడు మృతి చెందాడని రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం క్వారీ పనులు చేస్తుండగా గాయపడిన జానీని చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న లారీ



దెబ్బతిన్న టాటా ఏస్ వాహనం

మునగపాక: మండలంలోని నాగులాపల్లి రైస్ మిల్లు ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టాటా ఏస్ వాహన డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మునగపాక నుంచి అనకాపల్లి వైపునకు టాట్ ఏస్ వాహనం వెళ్తుంది. అదే సమయంలో ఎదురుగా వచ్చిన లారీ.. వ్యాన్‌ను ఢీకొంది. ఈ ఘటనలో టాటా ఏస్ ముందు భాగం దెబ్బతింది. సంబంధిత డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయనను అనకాపల్లిలోని ఆస్పత్రికి తరలించారు.

యోగా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, ప్రచారానికి కృషి చేసినందుకు అందించే ప్రధానమంత్రి యోగా పురస్కారాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.సత్యపద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం 20 సంవత్సరాల సేవ, అద్భుతమైన ట్రాక్ రికార్డు, యోగా ప్రచారానికి, అభివృద్ధికి అద్భుతమైన సహకారం అందించిన వారు https:// innovateindia. mygov.in/pm& yoga& awards&2025/ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పురస్కారాలు పొందిన వారికి నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, ట్రోఫీ అందిస్తారన్నారు.

కాపర్ చోరీ కేసులో 8 మంది అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చక్రధరరావు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలో పలు చోట్ల డ్రిల్లింగ్ చేసి కాపర్ దొంగతనానికి పాల్పడిన కేసులో 8 మందిని అరెస్ట్ చేసినట్లు ద్వారకా క్రైం సీఐ చక్రధరరావు తెలిపారు. ఈ వివరాలను శుక్రవారం ఎంవీపీ కాలనీ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నగరంలో ఎనిమిదేళ్ల కిందట జరిగిన బీఎస్ఎన్ఎల్ పనుల్లో పెందుర్తికి చెందిన ఆసనాల పిట్టోడు(ఏ1), ఏలూరుకు చెందిన బి.శ్రీను, జి.గోవర్ధన్, బి.ఏడుకొండలు, బి.రాజు, సీహెచ్ దుర్గాప్రసాద్, డి.రాజేష్, బి.ప్రసాద్ పాల్గొన్నారు. కాపర్ వైర్‌తో కూడిన పనులు చేపట్టారు. ప్రస్తుతం ల్యాండ్ లైన్ సేవలు నిలిచిపోవడంతో ఎవరూ పట్టించుకోరనే ఉద్దేశంతో కాపర్ వైర్ దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఎంవీపీకాలనీలో రాత్రి పూట అండర్ గ్రౌండ్ డ్రిల్లింగ్ చేసి.. 800 మీటర్ల కాపర్ వైరు చోరీ చేశారు. దీనిపై బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి చుట్టురి మురళీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారంపై బయటపడింది. ఈ కేసులో 8 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. 300 కిలోల కాపర్ వైరుతో పాటు టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి



సంఘటన స్థలంలో తాతీలు మృతదేహం

మాకవరపాలెం: రోడ్డు ప్రమాదంలో ఓ రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి మృతి చెందారు. మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన గుడివాడ తాతీలు(60) శుక్రవారం మధ్యాహ్నం నర్సీపట్నం నుంచి మోటార్ సైకిల్‌పై స్వగ్రామం వస్తున్నారు. మండలంలోని జి.గంగవరంలోని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ప్రమాదవశాత్తూ ఢీకొట్టారు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మాడుగులలో గీత కార్మిక షాపు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్, తదితరులు

మాడుగుల: వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం చేశామని స్థానిక ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. అంతకు ముందు గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులు నిబంధనలు ప్రకారం ఉన్నాయా? లేదా? అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ 22 ఐడీ కేసుల్లో పట్టుబడిన 144.25 లీటర్లు, ఐఎంఎల్ 26 కేసుల్లో 47.7 లీటర్లు, ఎన్‌డీపీఎల్ కేసులో పట్టుబడిన 7.44 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు.

మోటారు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో మోటారు కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరసన తెలిపారు. ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్, జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ మోటార్ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలన్నారు. ఆటో, మోటారు కార్మికులకు వాహనాల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు.

విడి భాగాల ధరలు తగ్గించాలన్నారు. 50 ఏళ్ల దాటిన మోటారు కార్మికులకు పింఛన్ సదుపాయం కల్పించాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి మోటార్ కార్మికులు ఐక్యంగా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 24న చలో ఢిల్లీ కార్యక్రమం జరగనుందని, ఈ కార్యక్రమానికి మోటారు కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కర పత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి లోవరాజు, ప్రతినిధులు జి.నారాయణరావు, కె.శ్రీను, నాగేశ్వరరావు, ఎస్.రమణ, సూరిబాబు, పి.కొండలరావు, ఎస్.సురేష్, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను ప్రదర్శిస్తున్న మోటారు కార్మికులు

విశాఖ ఉక్కు ఉద్యమం @1500

- 2021 నుంచి అలుపెరగని పోరాటం
- నేడు దీక్ష శిబిరం వద్ద మానవహారం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉద్యమం శనివారం నాటికి 1500 రోజులు పూర్తవుతుంది. స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం వ్యూహాత్మక అమ్మకం చేయాలని 2021 జనవరి 27న కేంద్ర కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్ కమిటీ నిర్ణయించింది. దీంతో ఉక్కు కార్మిక వర్గం భగ్గుమంది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పటి నుంచి కార్మికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో రెండు రోజులు ధర్నాలు చేశారు. జాతీయ రహదారిని పలుమార్లు దిగ్బంధించారు. స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం ముట్టడి, గేట్ల ముట్టడి చేపట్టారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో పార్లమెంట్‌లో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం వెనక్కు తగ్గేది లేదని తేల్చి చెప్పింది. ఉక్కు ఉద్యమానికి కార్మిక సంఘాలు, రచయితలు, మేధావులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు మద్దతు ఇస్తూ దీక్షల్లో పాల్గొంటున్నారు. దీక్షలు ప్రారంభించిన నాటి నుంచి ముఖ్యమైన ఘట్టాలను పరిశీలిస్తే.. 2021 ఫిబ్రవరి 3న వేలాది మంది కార్మికులు ఉక్కు పరిపాలన భవనాన్ని ముట్టడించారు. ఫిబ్రవరి 5న స్టీల్‌ప్లాంట్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేశారు. ఫిబ్రవరి 12న సీపీఐ కార్యదర్శి నారాయణ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఫిబ్రవరి 17న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ విమానాశ్రయంలో పోరాట కమిటీ నాయకులతో సమావేశమై తమ సంఘీభావం తెలిపారు. ఆ తర్వాత అన్ని రాజకీయ పార్టీలతో భారీ బహిరంగ సభ, జాతీయ రహదారి రాస్తారోకో, రెండు రోజులపాటు జాతీయ రహదారి దిగ్బంధం, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేత, చలో కలెక్టరేట్, 36 గంటల నిరాహార దీక్షలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన రైతు సంఘం నాయకులు రాకేష్ తికాయిత్ విశాఖ వచ్చి ఉక్కు ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. ప్రముఖ సామాజిక వేత్త మేధా పాట్కర్ దీక్ష శిబిరానికి విచ్చేసి కేంద్ర ప్రభుత్వం వైఖరిని ఎండగట్టారు. అప్పటి నుంచి రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.

నేడు మానవహారం

దీక్షలు ప్రారంభించి 1500 రోజులు పూర్తవుతున్న సందర్భంగా శనివారం సాయంత్రం దీక్షా శిబిరం వద్ద మానవహారం నిర్వహించనున్నట్టు పోరాట కమిటీ ప్రకటించింది. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించరాదన్న డిమాండ్లపై ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.



స్టీల్ ప్లాంట్ నుంచి జీవీఎంసీ వరకు బైక్ ర్యాలీ చేస్తున్న కార్మికులు(ఫైల్)

స్థల వివాదంపై ఇరువర్గాల ఫిర్యాదు



సర్పంచ్ రాజుబాబు దగ్గరుండి కూల్చేసినట్టు చెబుతున్న సత్యవతి ఇల్లు



గాయపడిన సర్పంచ్ పోలిరెడ్డి రాజుబాబు

గొలుగొండ: కొత్తమల్లంపేట గ్రామంలో ఇంటి స్థలం వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. గ్రామానికి చెందిన రొంగల సత్యవతి ఊరు శివారున రేకుల షెడ్డులో నివాసం ఉంటోంది. గురువారం రాత్రి దౌర్జన్యంగా ఇంటిలో నుంచి తనను బయటకు తీసుకువచ్చి సర్పంచ్ రాజుబాబు దౌర్జన్యం చేసి, ఇంటిని పొక్లెయిన్‌తో కూల్చివేశారని సత్యవతి ఆరోపిస్తోంది. కుటుంబ సభ్యుల గొడవలో స్థానిక సర్పంచ్ రాజుబాబు కలగజేసుకుని విద్యుత్ సరఫరా నిలిపివేసి, ఇంటిని నేలమట్టం చేశారని సత్యవతి గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అటుగా వెళ్తున్న తనపై దౌర్జన్యం చేయడంతో గాయపడినట్లు రాజుబాబు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యవతితో పాటు రాజుబాబు కూడా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొలుగొండ ఎస్ఐ రామారావు తెలిపారు.

ఉగాదికి పల్లె పండుగ పనులు ప్రారంభం

తుమ్మపాల: పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరై పూర్తి చేసిన పనుల ప్రారంభోత్సవాలను ఉగాది నుంచి వారం రోజులపాటు నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, డ్వామా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మంజూరైన 3,381 వ్యవసాయ చెరువుల పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.6 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనకాపల్లి టౌన్: పట్టణంలోని దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం హుండీ కానుకలు లెక్కించారు. ఈ లెక్కింపులో ఆరు లక్షల ఇరవై రెండు వేల యాభై మూడు రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో టి. రాజసులోచన తెలిపారు. ఈ ఆదాయం 72 రోజులదన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన అర్చకుడు పులకండం గిరిబాబు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక పుట్టుక మహోత్సవం



నూకాంబిక అమ్మవారి పాదాలు ఊరేగింపు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మవారి పుట్టుక మహోత్సవాన్ని గురువారం రాత్రి నుంచి ఉదయం వరకు ఘనంగా నిర్వహించారు. కొత్త అమావాస్య ముందు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అమ్మవారి గరగలు, పాదాలను అందంగా అలంకరించిన రిక్షాపై సంప్రదాయ డప్పులు, విద్యుద్దీపాలు, సాంస్కృతిక నృత్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.అనంతరం అమ్మవారిని గ్రామ శివారులో ఆలయంలో నెలకొల్పి పూజలు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్, వేగి రామరాజు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పగలే వీధి లైటు వెలుగులు



కశింకోట రైల్వేస్టేషన్ సమీపంలో వెలుగుతున్న వీధి లైటు

కశింకోట: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఏలేరు కాలువ ప్రాంతంలో స్తంభం వీధి లైట్ పట్టపగలే వెన్నెల కురిపిస్తోంది. దీంతో ఆ మార్గాన రాకపోకలు సాగించే ప్రజలు, వాహన చోదకులు విస్తుపోతున్నారు. విద్యుత్‌ను ఆదా చేయాల్సిందిపోయి వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వృథా నివారణకు పంచాయతీ వారు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

27న సబ్బవరం వైస్ ఎంపీపీ-2 ఎన్నిక

సబ్బవరం: మండలంలో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ-2 ఎన్నిక ప్రక్రియను ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు. వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద్ గతేడాది ఫిబ్రవరి 20న తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడిందన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ ఎన్నికల్లో చేతులు ఎత్తే విధానంలో సభ్యులు వైస్ ఎంపీపీ-2ను ఎన్నుకుంటారని పేర్కొన్నారు. ప్రస్తుతం 19 మంది ప్రాదేశిక సభ్యులున్న మండల పరిషత్ పాలకవర్గంలో మెజార్టీ సభ్యులు ఆమోదించిన వ్యక్తి ఎన్నికవుతారని తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 4,145 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,650	4,310
మొదటి రకం	3,600	4.000
రెండో రకం	3,110	3,810
మూడో రకం	2,900	3,100

అనకాపల్లి సినిమాలు

రాజా :	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-1:	టుక్‌టుక్
సత్యనారాయణ స్క్రీన్-2:	యుగానికి ఒక్కడు
పర్తిసాయి	: కోర్ట్
షిర్డీసాయి	: పెళ్లికాని ప్రసాద్
వెంకటేశ్వర(ఉదయం)	: షణ్ముక
వెంకటేశ్వర(మ్యాట్నీ, 1,2 షోలు):	న్యూ పోలీస్ స్టోరీ
శ్రీసత్య	: సలార్
రామచంద్ర	: ఛావా

బొజ్జన్నకొండ.. నిర్లక్ష్యం నిండా..



దోర్లు లాక్ చేసి ఉన్న బుద్దిస్ట్ ఎమినిటీస్ కేంద్రం



తుమ్మపాల: కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధిపై ప్రకటనలు తప్ప ఆచరణ సాధ్యం కావడం లేదు. విజన్ – 2047 అంటూ నానా ఆర్భాటాలు చేస్తూ.. తొమ్మిది నెలలుగా ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం విధానాలతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. నూతన జిల్లాల ఏర్పాటుతో అనకాపల్లి పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడింది. పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో జిల్లా కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. దీంతో పాటు గత ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పట్టణంలో అనేక రోడ్లను సుందరీకరణ చేసి నూతన శోభను తీసుకువచ్చారు. పట్టణానికి అతి సమీపంలో అత్యంత ఆహ్లాదకరమైన బొజ్జన్నకొండపై గత రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక మాజీ ఎంపీ బీవీ సత్యవతి, జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి బాటలు వేశారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7.50 కోట్లతో భవనాలు, శిలా తోరణం, బొజ్జన్నకొండపై లైటింగ్‌తో పాటు అప్పటి ఎంపీ నిధుల నుంచి దాదాపు రూ.1.50 కోట్లతో రోడ్లను పూర్తిచేసి కొండ రూపురేఖలు మార్చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో బొజ్జన్నకొండ అభివృద్ధిపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కొండ అభివృద్ధి అగమ్యగోచరంగా మారింది. భారీ నిధులతో పూర్తి చేసిన భవనం నిరుపయోగంగా మారింది.



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు, బల్లలు

● కోట్లు ఖర్చుతో పూర్తిచేసిన భవనం నిరుపయోగం...

జిల్లా కేంద్రంలో పురాతన కట్టడంగాను, ప్రాచీన చరిత్ర కలిగిన బొజ్జన్నకొండను జిల్లా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రత్యేక దృష్టితో భూమిని సమకూర్చి కేంద్ర నిధులతో మౌలిక సౌకర్యాలతో భవనాన్ని నిర్మించారు. తర్వాత కూటమి అధికారంలోకి వచ్చి ఆగమేఘాల మీద భవనాన్ని ప్రారంభించి చేతులు దులిపేసుకుంది. రూ.1.20 కోట్లతో పూర్తి చేసిన బుద్ధిస్ట్ ఎమినిటీస్ కేంద్రం, లేజర్ షో ఏర్పాట్లను ప్రారంభించి దాదాపు 6 నెలలు కావస్తున్నా, ఎటువంటి ముందడుగు పడలేదు. పది కుర్చీలు, 4 బల్లలతో సరిపెట్టేశారు. భవనంలో ఉన్న నాలుగు గదులు బూజు పట్టి నిరుపయోగంగా మారుతున్నాయి. భవనంలో నియమించిన హరిత రిసార్ట్ సిబ్బంది రోజూ ఉదయం వచ్చి సాయంత్రం వరకు విశ్రాంతి తీసుకుని వెళ్లిపోతున్నారు. కనీసం పర్యాటకులకు కూల్‌డ్రింక్ కూడా లేకుండా హరిత రిసార్ట్ దర్శనమిస్తోంది. భవనం ఏర్పాటు చేసిన బొజ్జన్నకొండ చరిత్ర లేజర్ షో పరికరాలు తప్పు పడుతున్నాయి.



తాళాలు వేసి ఉన్న వాష్ రూమ్స్

● పర్యాటకులను ఆకర్షించడంలో విఫలం...

గతానికి భిన్నంగా పూర్తి రోడ్లు, మౌలిక సౌకర్యాలు కల్పించేలా బొజ్జన్నకొండ అభివృద్ధి చెందింది. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధిని నీరుగార్చడమే లక్ష్యంగా పాలకులు అధికారులపై చేస్తున్న ఒత్తిడి కారణంగా కూటమి ప్రభుత్వంలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. పైగా పర్యాటక అభివృద్ధి కోసం వేసిన రోడ్డు మైనింగ్‌కు అడ్డాగా మారింది. రాత్రింబవళ్లు లేదా లేకుండా విచ్చల విడిగా బండరాళ్లతో క్వారీ లారీలు ప్రయాణిస్తున్నాయి. దీంతో ఈ మార్గం గుండా పర్యాటకులు సైతం వచ్చేందుకు భయాందోళనలు చెందుతున్నారు. ఈ ప్రాంతమంతా ఆహ్లాదకరమైన వాతావరణం, రోడ్డు పొడవున ఏలేరు కాలువ చల్లగాలితో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నడక కోసం వచ్చే వారు కూడా లారీలకు భయపడి రాలేని పరిస్థితి ఏర్పడింది.



బొజ్జన్నకొండ వద్ద నిరుపయోగంగా మారుతున్న హరిత రిసార్ట్

ఫుడ్ కోర్టు, లేజర్ షో ప్రదర్శన జరగాలి...

కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి భవనం, లైటింగ్ పూర్తిచేస్తే ఇప్పుడు నిరుపయోగంగా మారుతున్నాయి. ఏడాది క్రితం పూర్తి చేసిన బుద్ధిస్ట్ ఎమినిటీస్ కేంద్రం బూజు పడుతుంది. లోపల ఉన్న విశ్రాంతి గదులు పర్యాటకులకు అందరికి అందుబాటులోకి తీసుకురావాలి. ఫుడ్ కోర్ట్ పెట్టి అందరికి అవగాహన చేయడం ద్వారా పర్యాటకుల సందడి మరింత పెరుగుతుంది. అధికారులు, కూటమి నాయకులు దృష్టి సారించి సౌకర్యాలు అభివృద్ధి చేయాలి.

– బల్లా నాగ భూషణం, సామాజిక కార్యకర్త, అనకాపల్లి

అక్రమ క్వారీలపై చర్యలకు డిమాండ్



మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి టౌన్: మండలంలోని అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలని, మైనింగ్, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖల అధికారులు మామూళ్లకు అలవాటు పడి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్‌లు చేసి అక్రమంగా క్వారీల్లో రాళ్లను పేల్చడంతో చుట్టు పక్కల గ్రామాల్లో ఇళ్ల బీటలు వారుతున్నాయన్నారు. పట్టణంలో భారీ వాహనాలు రావడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, దీని వల్ల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. ఎంపీ సీఎం రమేష్ అక్రమార్కులకు అండగా ఉంటూ అధికారులను అడ్డుకుంటున్నారని, దీనివల్లే వారు నిస్సహాయక స్థితిలో ఉండిపోతున్నారన్నారు. క్వారీ యజమానులు అక్రమ ఆదాయం పెంచుకుంటున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని అక్రమ క్వారీలను మూసివేయాలని డిమాండ్ చేశారు.

పార్టీ కోసం పనిచేసే వారికే అనుబంధ కమిటీల్లో చోటు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పరవాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అనుబంధకమిటీల నియామకం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ కోసం కీలకంగా పనిచేస్తున్న వ్యక్తులను గుర్తించి, వారిని ప్రోత్సహించేలా అనుబంధ కమిటీల్లో అవకాశం కల్పిస్తామన్నారు. ఈ నియామకాలు పూర్తయిన వెంటనే ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనుబంధ విభాగాల కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆయా కమిటీల అధ్యక్షులు చొరవ తీసుకోవాలని సూచించారు. కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి పార్టీలో సరైన గుర్తింపు ఉంటుందని భరోసానిచ్చారు. పదవులు పొందిన నాయకులు కార్యకర్తలతో మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే పని చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని, దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు.

సమావేశంలో పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు వెన్నల సన్యాసిరావు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు చరణ్‌రాజ్, యువజన విభాగం అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్, సర్పంచ్‌లు వి.అప్పారావు, బి.కనకారావు, పి.అప్పారావు నాగమణి, గొర్లి గోపి అమ్మలు, కె.వరలక్ష్మి సీతారామయ్య, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు, నాయకులు బొద్దపు చిన్నారావు, జూనియర్ అప్పలనాయుడు, సుందరపు అప్పారావు, సుందరపు శ్రీను, భాస్కర్, సత్తిలు, ఎ.నారాయణరావు, కిరణ్, ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేవీలో అడ్మిషన్లు కొనసాగించాలి



ధర్నాలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం (కేవీ)లో ఒకటో తరగతి, 11వ తరగతులకు అడ్మిషన్లు వెంటనే కొనసాగించాలని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కేవీ ముందు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతి, 11వ తరగతులకు అడ్మిషన్లు ప్రారంభించొద్దని కేంద్ర ప్రభుత్వం ఉక్కు యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీని ద్వారా ఒక్కొక్క తరగతి మూసి వేయడానికి లేదా ప్రైవేటు సంస్థకు ఇవ్వడానికి సిద్ధమైందని మండిపడ్డారు. కేవీ ఉపాధ్యాయులను ఇతర కేవీలకు బదిలీ చేసి కాంట్రాక్ట్ ఉపాధ్యాయులతో ఈ కేవీని నడపడానికి చర్యలు తీసుకోబోతున్నారన్నారు. ఖర్చు తగ్గించుకోవాలనే దుర్మార్గపు చర్యలకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఒడిగట్టడం వల్లే ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. విశాఖ విమల విద్యాలయంలో కూడా ఒకటో తరగతి అడ్మిషన్లు నిలుపుదల చేశారన్నారు. ఈ అంశంపై రాష్ట్రంలోని కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి విన్నవించినా ఏ చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే యాజమాన్యం రెండు పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించకపోతే వందలాది మంది విద్యార్థులతో అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిస్తామన్నారు. ఆందోళనలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్న కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. దీనివల్ల నరసింగబిలి, జెట్టపురెడ్డితుని, ఎన్‌జీపాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం, సోమవరం, చింతలపాలెం, గొబ్బూరు, ఏఎస్ పేట, తాళ్లపాలెం, బంగారయ్యపేట, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, అచ్చెర్ల, జి. భీమవరం, సింగవరం, గొల్లగుంట, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. దీని దృష్ట్యా వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుపై హర్షం

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుపై ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు, విజ్ఞప్తుల మేరకు ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ రోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇందులో 20 బెడ్లు ఏర్పాటు చేయాలని సంఘాల నేతలు బొడ్డేడ అప్పారావు, బొట్టా చిన్ని యాదవ్, మంగరాజు, బొడ్డు సోమరాజు, ఆడారి బుచ్చిరాజులు కోరారు

షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్‌కు యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసు ఉపసంహరించుకోవాలని స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండేను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్మిక సమస్యలపై పోరాడుతున్న అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడం అన్యాయమన్నారు. ఉద్యోగులకు పెండింగ్ ఉన్న 205 శాతం జీతాలను ఈనెల 31లోగా చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును తక్షణమే ఆపాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్. రావు, యు. రామస్వామి, రమణమూర్తి, కొవిరి అవతారం, జి. గణపతిరెడ్డి, డి.వి. రమణారెడ్డి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐఎఫ్ఎస్ అధికారి



ఖజురియాకు అప్పన్న చిత్రపటం అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.పి.ఖజురియా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, జ్ఞాపికలను ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలి



పశు సంవర్థక శాఖ డీడీ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘ మిత్ర ప్రతినిధులు

కశింకోట: పశు గ్రాస పెంపుదల, పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని సంఘ మిత్ర ఎఫ్‌పీవో అధ్యక్షురాలు ఎస్. చిట్టెమ్మ, ఉపాధ్యక్షుడు ఆళ్ల అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు విశాఖ పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ అనకాపల్లి వచ్చిన సందర్భంగా శుక్రవారం రాత్రి కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ సహకారంతో నడిచే సంఘ మిత్ర ఫోడర్ గ్రోయర్స్ అండ్ ప్రొడ్యూసర్ కో-ఆపరేటివ్ సొసైటీ బలోపేతానికి పాడి రైతులు, పశుగ్రాస పెంపకం రైతులను సభ్యులుగా విరివిగా చేర్పించి వాటా ధనం చెల్లింపునకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు రావడానికి దోహదపడాలని కోరారు. సంఘ సీఈవో జైచంద్ర, డైరెక్టర్లు కాండ్రేగుల నాగేశ్వరరావు, విల్లూరి రాజేష్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊయలలో గౌరీ పరమేశ్వరుల సేవ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గౌరీ పంచాయతన దేవస్థానంలో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. అర్చకులు అంపోలు గోపాల కృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, శేషసాయిలతో ఈ సేవా కార్యక్రమం జరిగింది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహలక్ష్మినాయుడు, పాలకవర్గ సభ్యులు గౌరీ గీత మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని, పెతకంశెట్టి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌కు అంబులెన్స్ వితరణ



శంకర్ ఫౌండేషన్‌కు అంబులెన్స్ కీ అందిస్తున్న గెయిల్ సీజీఎం ఎల్.ఎస్.రావు

సింహాచలం: 93వ వార్డు పరిధి నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా(గెయిల్) రూ.27.50 లక్షలు విలువ చేసే అధునాతన అంబులెన్స్‌ను అందించింది. గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) ఎల్.ఎస్. రావు, జీఎం ఎంవీఎస్ మూర్తి అంబులెన్స్‌ను శంకర్ ఫౌండేషన్ జీఎం రాధాకృష్ణన్‌కు శుక్రవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఎల్ఎస్ రావు మాట్లాడుతూ సమాజానికి, పేదలకు శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. శంకర్ ఫౌండేషన్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జీఎం రాధాకృష్ణన్‌లు మాట్లాడుతూ గెయిల్ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డీజీఎంలు వి.రమేష్‌కుమార్, బంగార్రాజు, గెయిల్ డీజీఎం స్టీఫెన్ పట్నా, చీఫ్ మేనేజర్ మదన్ కులాడే, ఫైనాన్స్ మేనేజర్ ఎ.కిరణ్, సీఎస్ఆర్ సభ్యులు పాల్గొన్నారు.